
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 9 । అక్టోబర్ । 2025



సోమశిలలో 73.05 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 73.05 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 13,006 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2650, ఉత్తరకాలువకు 50, కండలేరుకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,25,960
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,332
3 శాతం జీఎస్టీతో	రూ.11,672
నవర (8 గ్రా)	రూ.93,376

గరిష్టం/కనిష్టం
34.2 /25.5

వాతావరణం

జిల్లాలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడి వాతావరణం ఉంటుంది. అక్కడ క్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. బుధవారం గాలిలో తేమ 75 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

సీజేఐపై దాడి యత్నం గర్హనీయం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నెల్లూరు (లీగల్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నం గర్హనీయమని ఖండిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని, న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అయ్యపరెడ్డి, నాగరాజయాదవ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు మరొకరు పాల్పడకుండా చర్యలు ఉండాలని, సీజేఐపై దాడి యత్నం అనైతిక చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి రాజేష్, స్వర్ణ ప్రసాద్, మహిళా న్యాయవాదులు లత శ్రీనివాస్, భ్రమరాంబిక తదితరులు పాల్గొన్నారు.

రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటుకు రండి

• కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరురూరల్: వ్యర్థాలను విలువైన సంపదగా మార్చేందుకు రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలశాఖ, పర్యావరణ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ప్రతి రోజూ 350 టన్నుల తడి, పొడి వ్యర్థాలను నెల్లూరు నగరపాలక సంస్థ సేకరిస్తుందని, ఈ వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్ల ద్వారా విలువైన సంపదగా తయారు చేయొచ్చన్నారు. ప్రభుత్వ పరంగా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీలు, అనుమతులు సకాలంలో అందించి ప్రోత్సహిస్తామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతోపాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ చెత్త నుంచి ఐరన్, ప్లాస్టిక్, పేపర్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేరు చేసి రీసైక్లింగ్ ప్లాంట్ల ద్వారా తిరిగి వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. తొలుత పరిశ్రమలశాఖ ద్వారా పారిశ్రామికవేత్తలకు రీసైక్లింగ్ యూనిట్లు, బయోడిగ్రేడబుల్ ప్లాంట్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ పరిశ్రమల ఏర్పాటుకు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను ఇండస్ట్రీస్ జీఎం మారుతీప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్, పరిశ్రమలశాఖ అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కాలుష్య జల కల్లోలం

ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేట, జగదేవిపేట గ్రామాల్లో స్టార్ స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్, సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా వచ్చే వ్యర్థ జలాలు గంగపట్నం–మైపాడుకు వెళ్లే పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. రొయ్యల శుద్ధి కోసం ఉపయోగించే రసాయనాలు కాలువల ద్వారా పొలాలు, చేపల గుంతలకు చేరుతోంది. ఈ మండలంలో సుమారు 18 వేల ఎకరాల పంట భూములు దెబ్బతింటున్నాయి. దీంతో చేపల చెరువుల్లో మత్స్యసంపద చనిపోతుంది.



కోడూరు బీచ్ వద్ద ఉన్న ఆక్వా ప్రైమ్ హేచరీ లోని పైప్ లైన్ ద్వారా కలువలోకి వదులుతున్న వ్యర్థ జలాలు



కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలోని రెండు రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థజలాలను పక్కనే ఉన్న మలిదేవి పంట కాలువలోకి వదిలేస్తున్నారు. దీంతో రామన్నపాళెం, ఆలూరుపాడు గ్రామ పొలాలు, గండవరం నుంచి పెయ్యలపాళెం మార్గంలోని మరో రొయ్యల ప్రాసెస్ ప్లాంట్ నుంచి వచ్చే రసాయ వ్యర్థాలను పైడేరులోకి వదిలేయడంతో ఈ కాలువ ద్వారా పారుదల జరిగే అల్లూరు మండలంలోని నార్త్‌మోపూరు, ఆములూరు గ్రామాల్లోని సుమారు 2 వేల ఎకరాల పొలాలు చౌడు బారుతున్నాయి.



దగదర్తి మండలం దామవరంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుకు సంబంధించిన బీఎంఆర్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ నుంచి వచ్చే వ్యర్థ నీటిని ఎల్లవ కాలువలోకి వదిలేస్తున్నారు. ఆ కాలువ నీరు రామన్నచెరువులోకి చేరుతోంది. ప్రమాదకరమైన రసాయనాలు కలగలిసిన నీరు కావడంతో భూసారంలో కలిసి పోతుంది. దీంతో చెరువు పారుదల అయ్యే సింగపేట, బోగోలు మండలం అల్లిమడుగు, ఉలవపాళ్ల ప్రాంతాల్లోని దాదాపు 2 వేల ఎకరాల్లో సాగయ్యే పంటలకు నష్టం కలుగుతుంది.

◆ ఎక్కడెక్కడ ఎలా..?

- తోటపల్లిగూడూరు మండలంలో ఉన్న శరత్ రొయ్యల ప్రాసెస్ యూనిట్ నుంచి రసాయన వ్యర్థ జలాలను ఈదూరు, కోడూరు జాయింట్ చెరువు నుంచి వెళ్లే పంట కాలువలోక్లి నీరు వదిలేస్తున్నారు. ఆ కాలువ కింద సుమారు 5 వేల ఎకరాలకు పైగా సాగవుతోంది. రసాయనాలు కలిసిన నీరు పంట పొలాల్లోకి వెళ్తున్నాయి
- వెంకన్నపాళెంలో ఉన్న శరత్‌సీడ్ ప్లాంట్ నుంచి వచ్చే రసాయనాల నీరు బకింగ్ హోం కెనాల్‌లోకి వదిలేస్తున్నారు.
- కోడూరు బీచ్ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన జేజే మెరైన్, సాయి ఆక్వా, ఇండోమెరైన్, భవానీ, ఆదిత్య హేచరీల నుంచి వ్యర్థ జలాలు బకింగ్ హోం కెనాల్‌లోకి వదిలేస్తున్నారు. రసాయనాల కలిసిన వ్యర్థ జలాలు కాలువలో కలిసిపోవడంతో మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతోంది.
- కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలంలో ఏర్పాటైన ఆంజనేయ, గ్రీన్ హౌస్ ఆగ్రో ప్రొడెక్స్, పెడోరా నుంచి వ్యర్థ జలాలు మలిదేవి డ్రెయిన్‌లో వదిలేస్తున్నారు, ఆ డ్రెయిన్ పరిధిలో ఆలూరుపాడు, మోడేగుంట, మానేగుంటపాడు గ్రామాల పరిధిలోని దాదాపు 300 ఎకరాలు ఆయకట్టులో పంటలు సాగువుతున్నాయి. రసాయనాలు కలిసిన జలాలు డ్రెయిన్‌లో కలవడం వల్ల ఆ నీరు పారే భూములు చౌడు తేలి పంటల ఎదుగుదల క్షీణించిపోతుంది.
- గండవరం వద్ద ఏర్పాటు చేసిన ఆల్ఫా మెరైన్ ప్రాసెస్ యూనిట్ నుంచి వచ్చే రసాయన వ్యర్థ జలాలు పైడేరులోకి వదిలేస్తున్నారు. ఆ పైడేరు పరిధిలోని అల్లూరు మండలలోని నార్తుమోపూరు, నార్త్‌ఆములూరు గ్రామాలకు చెందిన 800 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది.



దామవరం వద్ద బీఎంఆర్ ప్లాంట్ నుంచి పంట పొలాల మధ్యలో ఉన్న కాలువలో పారుతున్న రసాయన వ్యర్థజలాలు



తోటపల్లి గూడూరు మండలం మహాలక్ష్మీపురంలోని శరత్ ఇండస్ట్రీస్ విడుదల చేసే కెమికల్ నీటితో దెబ్బతింటున్న పంట పొలాలు

ఊపిరి తీస్తున్న రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు

- దగదర్తి, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లో పది ప్లాంట్లు
- సాగునీటి కాలువల్లోని వ్యర్థ జలాలు
- కెమికల్ వ్యర్థాలతో చౌడు బారుతున్న 24 వేల ఎకరాల సాగు భూములు
- ఈ నీరు తాగి వేల పశువుల మృతి
- భూగర్భ జలాలు కలుషితమై జీర్ణకోశ, కేన్సర్ వ్యాధులు
- వ్యర్థ జలాలతో మృత్యువాత పడుతున్న చేపలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రొయ్యల శుద్ధి కంపెనీలు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. వీటి ద్వారా వెలువడే రసాయనాలు సాగునీటి కాలువల్లోకి వదిలేస్తున్నారు. తద్వారా సాగు భూములు విషతుల్యంగా మారిపోతున్నాయి. భూగర్భ జలాలు కూడా కలుషితమై తాగునీరు సైతం విషంలా మారి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతున్నాయి. కొన్నేళ్లుగా రొయ్యల ప్రాసెస్ యూనిట్లలో జరిగే ఈ వ్యవహారం వెలుగులోకి రానివ్వడం లేదు. స్థానిక రైతులు గగ్గోలు పెడుతున్నా అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్నారు. తమ పరిధిలోకి రాదని పొల్యూషన్ బోర్డు అధికారులు చెబుతుంటే.. పరిశీలించి చర్యలు తీసుకుంటామంటూ మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 33,128 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. ఆ రంగానికి అనుబంధంగా పది వరకు రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, 61 సీడ్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీటిలో 22 సీడ్ హేచరీలు ఉత్పత్తి చేస్తున్నాయి. ఆయా ప్రాసెస్ యూనిట్లు, హేచరీల్లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. చాలా వరకు పీసీబీ ప్రమాణాలు పాటించడం లేదు. యూనిట్ల నుంచి వచ్చే రసాయనాలు కలిసిన వ్యర్థాలను నేరుగా పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఫలితంగా భూములు చౌడు బారి బీడ్లుగా మారిపోతున్నాయి. పైర్ల ఎదుగుదల క్షీణించిపోతుంది. ఆ ప్రాంతంలో ఆ నీరు భూగర్భంలోకి ఇంకి తాగేనీరులో కూడా విషపూరితం కావడంతో ఎన్నో వ్యాధులు ప్రబలి మనుషుల ప్రాణాలకే హాని కలిగిస్తోంది.

◆ అసలేం చేయాలి..

అధిక శాతం ప్రాసెస్ యూనిట్లు, సీడ్ హేచరీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. వాస్తవానికి రొయ్యల శుద్ధి కేంద్రాల్లో రియల్ టైం పొల్యూషన్ తెలిపే ఆర్‌టీపీఎంస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. స్లూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన వ్యర్థ జలాలను అందులోకి పంపించాలి. కానీ ఆ ప్లాంట్ ఏర్పాటు ఖర్చుతో కూడినది కావడంతో ప్లాంట్ యజమానులు నేరుగా బయట పంట కాలువలకు వదిలేస్తున్నారు. వాస్తవంగా రొయ్యల శుద్ధిలో ఏడు రకాల రసాయనాలు వాడుతారు. పీసీబీ ప్రమాణాలకు లోబడి శుద్ధి చేయాలి. శుద్ధి చేసిన వ్యర్థాలను డిస్పోజ్ కంపెనీకి అప్పగించాలి. కానీ వాటిని అనధికారికంగా బయటకు పంపుతున్నారు.

హరిస్తున్న పశువుల ప్రాణాలు

రొయ్యల శుద్ధికి సోడియం, క్లోరైడ్, అమ్మోనియా వంటి ప్రమాదకర రసాయనాలు వాడుతారు. రొయ్యల నుంచి వచ్చే వ్యర్థాలు మగ్గుతాయి. కుళ్లిన వ్యర్థాలు కలిసిన నీటిని పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఆ నీటిని తాగడం వల్ల పశువులకు స్థానిక ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. గత పదేళ్లలో వివిధ రకాల వ్యాధులతో రెండు వేల వరకు పశువులు మృతి చెందినట్లు తెలుస్తోంది. వెటర్నరీ వైద్యుల శాంపిల్స్ ల్యాబ్‌లో పరిక్షీస్తే కలుషిత నీటితో వచ్చే వ్యాధులు సోకినట్లు వారు గుర్తించినట్లు సమాచారం.

తినే ఆహారం విషమే

రసాయనాలు కలిసిన సాగునీటి వల్ల ఈ ప్రాంతంలో సారవంతమైన పొలాలు లవణ (ఉప్పు) శాతం పెరిగి చౌడుబారాయి. భూముల్లోని ఐదు పొరల్లో చౌడు బారి పంటల ఎదుగుదల నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల్లోనూ రసాయనాలు కలుస్తున్నాయి. కలుషిత నీటితో పండిన పంట ఉత్పత్తులు తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, అతిసారా, గ్యాస్ట్రో, కేన్సర్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

రొయ్యల పరిశ్రమలు మా పరిధి కాదు

జిల్లాలోని రొయ్యల గుంతల కలుషితం నీరు చెరువుల్లోకి, పంట పొలాల్లోకి వదిలినప్పటికీ, పంటలు దెబ్బతిన్నప్పటికీ, కలుషిత రొయ్యల గుంత నీటి వల్ల ఇతర సమస్యలు ఉత్పన్నమైనప్పటికీ అది మా పరిధిలోనిది కాదు. ఇందుకు సంబంధించి మత్స్యశాఖ చర్యలు చేపట్టాల్సి ఉంది.
– రాజశేఖర్, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

కఠిన చర్యలు తీసుకుంటాం

అనుమతులు లేకుండా, సరైన నిబంధనలు పాటించకుండా రొయ్యలు, చేపల ప్రాసెస్ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. తప్పని సరిగా రక్షణ చర్యలు తీసుకోవాలి. నీరు, వాతావరణం కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ శాంతి, ఫిషరీస్, జేడీ

పంటలు దెబ్బతింటున్నాయి



రొయ్యల ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థపు నీటిని నేరుగా పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. రసాయనాలు కలిపి ఉన్న ఈ నీటి వల్ల మా పంట పొలాలు దెబ్బతింటున్నాయి. రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా.. మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.
– టీ వెంకటరమణారెడ్డి, జగదేవిపేట

రోగాల బారిన పడుతున్నారు



రొయ్యల ఫ్యాక్టరీ నిర్వాహకులు కొంతకాలం మురికి నీటిని నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్నారు. దుర్వాసనాలు వెదజల్లే ఈ నీటితో ఈ ప్రాంత వాసులు వ్యాధుల బారిన పడుతున్నాయి. ఆ నీటితో దుస్తులు ఉతికితే చర్మ వ్యాధులు సోకుతున్నాయి. పశువులు సైతం ఆ నీటిని తాగలేకున్నాయి. – వై సుధీర్‌రెడ్డి, జగదేవిపేట

మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు



నెల్లూరులోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట కాకాణి పూజిత, మహిళా నేతల నిరసన

- నకిలీ మద్యంతో రూ.వేల కోట్లు దోచేశారు
- ప్రభుత్వ పెద్దల అండతోనే మద్యం తయారీ కేంద్రాల ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత
- ఎక్సైజ్ డీసీ కార్యాలయం ఎదుట మహిళలతో కలిసి నిరసన

నెల్లూరు (క్రైమ్): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేస్తానన్న చంద్రబాబు మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత విమర్శించారు. బుధవారం బీవీ నగర్‌లోని ఎక్సైజ్ డీసీ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. రాష్ట్రంలో వెలుగు చూసిన నకిలీ మద్యం తయారీ ఘటనలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సూత్ర, పాత్రధారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. కాకాణి పూజిత మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. 24 గంటలు మద్యం దొరుకుతుండడంతో నేరాలు పెరిగాయని, ప్రధానంగా మహిళలు తీవ్ర వేధింపులకు గురవుతున్నారన్నారు. కల్తీ మద్యం ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పారదర్శక విధానంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం షాపులు నిర్వహించిందని, జగనన్న ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని అందించిందనీ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసి బెల్టు షాపులు, నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పడకుండా పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. ఇంత పారదర్శకంగా జరిగినా మద్యం విధానంలో స్కామ్ జరిగిందంటూ చంద్రబాబు ప్రభుత్వం దుష్ప్రచారానికి తెరలేపిందన్నారు. లేని మద్యం స్కామ్‌ను సృష్టించిన చంద్రబాబు నేడు రాష్ట్రంలో నకిలీ మద్యం స్కామ్‌కు తెర తీశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండలేకపోతే.. ఈ స్థాయిలో నకిలీ మద్యం తయారు చేసి యథేచ్ఛగా విక్రయాలు చేసేవారా? అని ప్రశ్నించారు. నకిలీ మద్యం తయారీ వెనుక ఎక్సైజ్ అధికారుల పాత్రపై విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి పాలనలో ప్రతి నాలుగు బాటిళ్లలో ఒక నకిలీ మద్యం బాటిల్ ఉంటోందని ఆరోపించారు. ప్రతి నిత్యం ఎక్సైజ్ దాడుల్లో వేలకొలది నకిలీ మద్యం బాటిళ్ల గుర్తిస్తున్నారని, మాఫియాకు ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నకిలీ మద్యం తయారీపై ఉక్కు పాదం మోపాలని, తయారీదారులు ఎంతటి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలోనూ నకిలీ మద్యంతో మరణాలు సంభవించాయని, వీటిపైనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోస్ క్షిపణితో పాక్‌పై విజయం

- సాంకేతిక పురోగాభివృద్ధి అంశాలపై అవగాహన సదస్సు
- డీఆర్డీఓ మాజీ చైర్మన్, ఏపీ ప్రభుత్వ గౌరవ సలహాదారుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): బ్రహ్మోస్ క్షిపణిని రష్యాతో కలిసి తయారు చేశామని, బ్రహ్మోస్‌లో సొంతంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఉందని, బ్రహ్మోస్ క్షిపణితో పాక్‌పై విజయం సాధించామని డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి తెలియజేశారు. భారతదేశంలో క్షిపణులకు అబ్దుల్ కలాం ఆద్యుడని, ఈ నెల అక్టోబర్ 15న ఆయన జయంతి వేడుకలను అన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించాలని సతీష్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో బుధవారం నగర పాలక సంస్థ పరిధిలోని 23 మున్సిపల్ పాఠశాలల పదో తరగతి విద్యార్థుల శాస్త్ర సాంకేతిక పురోగాభివృద్ధి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రామేశ్వరంలోని చిన్న గ్రామంలో ప్రభుత్వ పాఠశాల చదివారని, విద్యతోనే గొప్ప శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతి అయ్యారని తెలిపారు. తాను కూడా గవర్నమెంట్ స్కూల్ మహిమలూరు పాఠశాల, వీఆర్ కాలేజీలో చదివానని, అబ్దుల్ కలాం వేసిన బీజం వల్ల ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిందని విద్యార్థులకు వివరించారు. స్వదేశీ ఆలోచనలతో రూపొందించిన ఆత్మ నిర్భర్ భారత్ ఆయుధాలతో భారత్ వివిధ యుద్ధాలలో గొప్ప విజయం సాధించిందని తెలియజేశారు. ప్రతి విద్యార్థి రాత్రింబవళ్లు కష్టపడి చదవాలని, స్కూల్‌కు, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్, డీఈఓ బాలాజీరావు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, డిప్యూటీ డీఈఓ నాయక్, నెల్లూరు అర్బన్ ఎంఈఓలు తిరపాల్, హమీద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,634 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 24,980 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

నకిలీ మద్యం కాదు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరురూరల్ మండలం మూడో మైలు, కలిగిరి మండలం వెలగపాడులో ఇద్దరు వ్యక్తుల మరణాలకు నకిలీ మద్యం కారణం కాదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీహైడ్రేషన్ వల్లే మృతి చెందారన్నారు. జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఇరిగేషన్ కతలు ఇంతింత కాదయా..!

• అంతా ఇష్టారాజ్యం • ఏ పనైనా.. కాసులిస్తేనే • యథేచ్ఛగా దందాలు

జిల్లా ఇరిగేషన్ శాఖలో వ్యవహారం అంతా ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఏ పని జరగాలన్నా వారు చెప్పినంత క్యాష్ కొట్టాల్సిందే. కాలువల్లో నీరు పారుతుందో లేదో తెలియదు గానీ డబ్బులిస్తే మాత్రం ఆఫీస్‌లో అటెండర్ల మొదలుకొని డీఈల వరకు పనులు ఇట్టే జరిగిపోతాయి. ఉద్యోగోన్నతులు, అంచనాలు, ప్లాన్ ప్రతిపాదనలు, ఎల్‌టీసీలు, ఉద్యోగుల డిప్యుటేషన్లు ఇలా ఏది కావాలన్నా.. సీనియర్ అసిస్టెంట్లు, సూపరిండెంటెంట్లు, ఎన్టీపీఏలు, హెచ్‌డీలు, మేనేజర్లకు మొత్తాన్ని కక్కాల్సిందే. ఆ శాఖలో పనులకు నిధులు రాక పోవడంతో ఉద్యోగుల మధ్య ఈ దందా పెరిగిపోతోంది.



ఇరిగేషన్ శాఖ జిల్లా ప్రధాన కార్యాలయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇరిగేషన్ శాఖలో అవినీతి పరవళ్లు తొక్కుతోంది. కాసులిస్తేనే ఏ పనైనా జరుగుతుంది. ఉద్యోగోన్నతులు రావాలంటే మంత్రులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేయాల్సిందే. అలా జరిగినా సీనియర్ అసిస్టెంట్ నుంచి మేనేజర్ వరకు నగదును ముట్టజెప్పాల్సిందే. ఒకవేళ అలా కాని పక్షంలో వ్యవహారం ఎక్కడికక్కడ ఆగిపోతుంది.

ఉద్యోగోన్నతులకు ఇంతా..?

ఇరిగేషన్ శాఖలో ఉద్యోగోన్నతులకు నిబంధనలను నిర్దేశించారు. అయితే అటెండర్ (ఆఫీస్ సబార్డినేట్) నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కావాలంటే రూ.10 వేలు నుంచి రూ.15 వేలు.. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌కు రూ.15 వేల నుంచి రూ.20 వేలు.. ఆపై వీరు మంచి ప్రాంతానికి వెళ్లాలంటే రూ.20 వేల నుంచి రూ.30 వేలను ముట్టజెప్పాల్సిందే. కారుణ్య నియామకాలకు సైతం నగదును సమర్పించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

చీపుర్లకు రూ.వేలల్లో బిల్లులు

చీపుర్లు, నీళ్లకు నెలకు రూ.20 వేల బిల్లులను కార్యాలయంలోని ఒక సూపరింటెండెంట్ పెడుతున్నారని సమాచారం. హెచ్‌డీలు ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పాతుకుపోయారు. అసోసియేషన్ నేతలుగా ప్రకటించుకుంటూ వారి స్థానాలు మారకుండా చూసుకుంటున్నారు. అనుమతుల కోసం ప్రతిపాదనలను పంపేందుకు గానూ పనిని బట్టి వారికి పర్సంటేజీలను సమర్పించాలి. సంబంధిత ఏఈఈ, డీఈఈల ద్వారా వీరికి సదరు కాంట్రాక్టర్ అందించాల్సి వస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా నిరాకరిస్తే ప్రతిపాదనలు టేబుళ్లకే పరిమితమైపోతున్నాయి. ఇరిగేషన్ ప్రధాన కార్యాలయం, సెంట్రల్.. ఆత్మకూరు డివిజన్లు, ఆరు సబ్ డివిజన్లుండగా, ప్రతి చోట ఈ వ్యాపారం ఒకే రకంగా జరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ప్రశ్నించేవారేరీ..?

రహస్య టెండర్ల ప్రతిపాదనలను కాంట్రాక్టర్లకు అందించడం.. కుమ్మక్కై, వారందించిన డబ్బుతో అర్హత లేని వారికి టెండర్లను ఆమోదించడంలో ఓ మేనేజర్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ శాఖలో ప్రశ్నించే వారే లేకపోవడంతో ఆయన చెప్పిందే వేదమని కాంట్రాక్టర్లు, ఉద్యోగులు పేర్కొంటున్నారు.

చర్యలు చేపడతాం

ఈ వ్యవహారాలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. సంబంధిత విభాగాల్లో విచారణ జరిపిస్తాం. బాధితులెవరైనా ఉంటే నేరుగా కలవొచ్చు. విచారణ జరిపి నిబంధనలను అనుసరించి ఆయా ఉద్యోగులపై చర్యలు చేపడతాం.

– దేశ్‌నాయక్, సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇరిగేషన్ శాఖ

డైవర్షన్లలోనూ ఇదే తీరు..

ఈ శాఖలో డిప్యుటేషన్లపై పనిచేయడాన్ని డైవర్షన్ అంటారు. తాము పనిచేస్తున్న ప్రాంతం నుంచి డైవర్షన్ పొందేందుకు సుమారు రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు చెల్లించాల్సి ఉంటోంది. డీఈఈ స్థాయి వారూ ఈ పనిచేయాల్సి వస్తోంది. లేఅవుట్లు, కల్వర్టులు, బ్రిడ్జిల అనుమతులకు సంబంధిత వ్యక్తుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తూ సంపాదనను పెంచుకోవచ్చనే ఉద్దేశంతో ఈ శాఖలో అధిక శాతం మంది డైవర్షన్లోనే ఉంటున్నారు. మరికొంత మంది మరో అడుగు ముందుకేసి సదరు లేఅవుట్‌కు సంబంధించిన వ్యక్తులు బ్రిడ్జిలను నిర్మిస్తే వాటిని ఎంబుక్‌లో నమోదు చేసి ఇరిగేషన్ శాఖే సొంతంగా కట్టించినట్లూ చూపుతున్నారు. మరోవైపు సాధారణ సమయానికీ ఆఫీసులకు రారు. ఒక ఎన్టీపీఏ వేరే జిల్లా నుంచి మధ్యాహ్నం 12 గంటలకు సైతం వస్తారు. వీరిపై ఎలాంటి చర్యల్లేకపోవడంతో ఇష్టారాజ్యంగా తమ పనులను జరుపుకొంటున్నారు.

ఏయ్.. మీ అంతు చూస్తా

- మా హాస్పిటల్ ముందే చెత్త ట్రాక్టర్లను ఆపుతారా..?
- పారిశుధ్య కార్మికులను దుర్భాషలాడిన టీడీపీ నేత కుమారుడు



హాస్పిటల్ ఎదుట మున్సిపల్ కార్మికుల నిరసన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అధికారముందనే ధీమాతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. తాజాగా బుచ్చిరెడ్డిపాళెంలోని మున్సిపల్ కార్మికులపై టీడీపీ పట్టణాధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు కుమారుడు శంతన్ హర్ష బూతులతో చెలరేగిపోయారు. మున్సిపల్ కార్మికులు, స్థానికుల వివరాల మేరకు.. పట్టణ పరిధిలోని బస్టాండ్ కూడలి సమీపంలో గల పాత పెట్రోల్ బంక్ పక్కన శ్రీనివాసులు కుమారుడికి ఓ ప్రైవేట్ హాస్పిటల్ ఉంది. ఈ క్రమంలో దాని ఎదురుగా ట్రాక్టర్లను నిలిపి అందులో చెత్తను కార్మికులు వేయసాగారు. ఈ తరుణంలో అక్కడికి చేరుకున్న శంతన్ హర్ష తమ హాస్పిటల్ ముందు ఎందుకు నిలిపారని ప్రశ్నించారు. పని అయిపోగానే వెళ్లిపోతామని కార్మికులు చెప్పినా వినకుండా.. ట్రాక్టర్లను నిలిపేందుకు ఎంత ధైర్యమంటూ బూతులతో రెచ్చిపోయారు. ట్రాక్టర్లకు గాలి తీసేసి.. దిక్కున్న చోట చెప్పుకోండంటూ జులుం ప్రదర్శించారు.

నిరసన

చెత్త ట్రాక్టర్లను హాస్పిటల్ ఎదుటే నిలిపి నిరసనను కార్మికులు వ్యక్తం చేశారు. తమను దూషించిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలంటూ నినాదాలు చేశారు. మున్సిపాల్టీలోని ఇతర విభాగాల నేతలు సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న కమిషనర్ బాలకృష్ణ, మున్సిపల్ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని కార్మికులు.. టీడీపీ నేత కుమారుడితో మాట్లాడటంతో గొడవ సద్దుమణిగింది.

విధులకు ఆటంకం కలిగించడం సరికాదు

మున్సిపల్ కార్మికులను దూషించడం, ట్రాక్టర్లకు గాలితీసి విధులకు భంగం కలిగించడం చట్టరీత్యా నేరం. తప్పును శంతన్ అంగీకరించడంతో విధుల్లో కార్మికులు చేరారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు చేపడతాం.

– బాలకృష్ణ, కమిషనర్

నమ్మకంగా ఉంటూ.. దోచేసి

నెల్లూరు సిటీ: ఓ వ్యాపారి ఇంట్లో 60 గ్రాముల బంగారాన్ని చోరీ చేసిన ఘటనలో నిందితులను నెల్లూరు రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సామంతులవారితోపునకు చెందిన రవిచౌదరి ఇంట్లో కొంతకాలంగా రాయవరపు వెంకటేశ్వర్లు, లలిత నమ్మకంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లోని ఓ గదిలో 60 గ్రాముల ఆభరణాలను ఉంచారు. దీన్ని వారు దొంగలించి ఏమీ తెలియనట్లు నటించారు.

యజమానికి అనుమానమొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో పనిచేసేవారే చోరీకి పాల్పడ్డారని విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

క్లుప్తంగా

చదువుతో పాటు సంస్కారాన్ని నేర్పాలి



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం: విద్యాలయాలు చదువుతో పాటు సంస్కారం పెంచే కేంద్రాలుగా పనిచేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కాంక్షించారు. మాట మంచి కార్యక్రమం ద్వారా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో అక్షర విద్యాలయ విద్యార్థులతో బుధవారం సమావేశమైన ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉదయాన్నే నిద్ర లేవడం, యోగా, నడక వంటి వ్యాయామాలకు అలవాటు పడాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన చదువుతో పాటు సంస్కారాన్ని నేర్పాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి గోల్డెన్ పీకాక్ అవార్డు



ఎస్‌ఈఐఎల్ సీఈఓ మహాపాత్ర

ముత్తుకూరు (పొదలకూరు) : దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పాదకత సంస్థల్లో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు 2025 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ పీకాక్ అవార్డు లభించింది. ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విజేతగా నిలిచినట్లు సీఈఓ జనమేజయ మహాపాత్ర వెల్లడించారు. ఈ అవార్డు కార్పొరేట్ సంస్థల అత్యుత్తమ పాత్రను వెల్లడిస్తుందన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులతోనే అవార్డు లభించిందన్నారు. వాటాదారులతో పాటు దేశ వృద్ధి రేటును సూచిస్తోందని పేర్కొన్నారు. ఈ అవార్డును లండన్‌లో వచ్చే నెల్లో అందజేయనున్నారని వెల్లడించారు.

మద్యానికి డబ్బివ్వకపోవడంతోనే హత్యలు

- జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలో సంచలనం రేకెత్తించిన జంట హత్యల కేసును సాంకేతికత ఆధారంగా గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. నగదు ఇవ్వలేదనే అక్కసుతోనే నిందితులు అత్యంత పాశవికంగా హత్య చేశారు. వివరాలు.. పెన్నా బ్యారేజీ సమీపంలో ఇద్దరు వ్యక్తులను కొందరు సోమవారం అర్ధరాత్రి కిరాతకంగా హత్య చేసి జాఫర్‌సాహెబ్ కాలువలో పడేశారు. విషయం వెలుగులోకి మంగళవారం రావడంతో క్రేన్లు, స్థానికుల సాయంతో మృతదేహాలను కాలువలో నుంచి పోలీసులు వెలికితీయించారు. వీరిని పెన్నా సమీపంలో నివాసం ఉంటున్న మానికల పోలయ్య, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన శివగా గుర్తించారు. నగరంలో శివ కొంతకాలంగా ఉంటూ కేటరింగ్, బేల్దారి పనులు చేస్తూ వచ్చిన సంపాదనతో మద్యం సేవించేవారు. రాత్రి వేళ బస్టాండ్లు, పెన్నావారధి సమీపంలో నిద్రించేవారని తెలిసింది. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసును సంతపేట పోలీసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులను పుత్తా ఎస్టేట్స్ సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న సాయిశంకర్, ముత్తుకూరు మండలం నారికేళపల్లికి చెందిన మనోజ్‌గా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వేస్టేషన్ నుంచి రంగనాయకులపేట రైల్వేగేట్‌కు వెళ్లే దారిలో వీరిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నగదు కోసమే హత్య

సాయిశంకర్,, మనోజ్ పూటుగా మద్యం సేవించి జాఫర్‌సాహెబ్ కాలువ వద్దకు సోమవారం అర్ధరాత్రి వెళ్లారు. అటుగా వస్తున్న శివ, మరో నలుగుర్ని అడ్డుకొని నగదును డిమాండ్ చేశారు. తమ వద్ద లేవని వారు చెప్పగా, రాళ్లు, కర్రలతో శివపై నిందితులు విచక్షణరహితంగా దాడికి పాల్పడి హత్య చేశారు. అక్కడున్న నలుగురు భయంతో పరుగులు తీశారు. శివ మృతదేహాన్ని జాఫర్‌సాహెబ్ కాలువలో నిందితులు పడేశారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న పోలయ్యను అడ్డుకొని నగదును డిమాండ్ చేశారు. లేవని చెప్పడంతో ఆయన్నూ హతమార్చారు. పోలయ్య మృతదేహాన్ని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి జాఫర్‌సాహెబ్ కాలువలో పడేసి అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. సాయిశంకర్‌పై చిన్నబజార్, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లలో మూడు.. మనోజ్‌పై ముత్తుకూరు పోలీస్‌స్టేషన్లో 12 కేసులున్నాయని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ అజిత అభినందించారు.

మర్రిగుంటలో ఏపీడీ విచారణ

కొండాపురం: మండలంలోని మర్రిగుంటలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని, పనికెళ్లని వారి పేరిట మస్టర్లు వేసి నగదును ప్రస్తుత ఫీల్డ్ అసిస్టెంట్ స్వాహా చేశారంటూ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు చిట్టావత్తిన మాచర్ల, తిరుపతిరెడ్డి తదితరులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఉదయగిరి ఏపీడీ మృదుల గ్రామంలో విచారణను బుధవారం చేపట్టారు. పనికెళ్లిన వారిని పిలిచి వివరాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ అంకబాబు అవినీతికి పాల్పడ్డారనే ఫిర్యాదుతో విచారణను చేపట్టామని వివరించారు. మస్టర్లను పరిశీలించి.. విచారణను జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని వివరించారు. కాగా విచారణ సమయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. రాజకీయ దురుద్దేశంతోనే టీడీపీ నేతలు ఫీల్డ్ అసిస్టెంట్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ గోపీ, ఏపీఓ మురళీధర్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్లు, తయారీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టండి

నెల్లూరు రూరల్: దీపావళి నేపథ్యంలో జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములను వెంటనే తనిఖీ చేసి, 48 గంటల్లోపు పూర్తి నివేదికను అందజేయాల్సిందిగా అగ్నిమాపకశాఖ అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారో లేదో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. కోనసీమ జిల్లాలో జరిగిన ఘటన నేపథ్యంలో జిల్లాలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. తయారీ కేంద్రాల సమీపంలో పాఠశాలలు లేదా జనసంచారం లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. లైసెన్స్ పొందిన వారే బాణాసంచా తయారీ, నిల్వలను నిర్వహించాలన్నారు. నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాణసంచా కాల్చే సమయాల్లో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం



కావలి(అల్లూరు): చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కావలి మండలం ఆముదాలదిన్నెలోని పొలాల్లో బుధవారం చోటుచేసుకుంది. దాదాపు 50 ఏళ్ల వయస్సున్న వ్యక్తి తన చొక్కాతో ఉరేసుకొని ఉండటాన్ని గమనించిన అటుగా వెళ్లే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. వివరాలు తెలిసిన వారు 94407 96312 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల అండర్ – 17 బాలబాలికల ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేయనున్నామని జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శులు రమణయ్య, దేవిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల క్రీడాకారులు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్దకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకొని సంబంధిత పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 94929 36165, 94903 20435 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నిమ్మ ధరలు

పెద్దవి: రూ.40
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15


దళితులపై పెరుగుతున్న దాడులు



మాట్లాడుతున్న చింతా మోహన్

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువవుతున్నాయని మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇటీవలి కాలంలో సామాజిక న్యాయమంటూ సీఎం చంద్రబాబు తరచూ చెప్తున్నారని, ఇది దళితులను రెండు వర్గాలుగా చీల్చడమానని ప్రశ్నించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అతి తక్కువ సేకరించి మిల్లర్లకు ప్రభుత్వం మేలు చేసిందని విమర్శించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన ఘటన ప్రజాస్వామ్యానికే మాయని మచ్చని చెప్పారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



వెంకటాచలం: సాగునీటి కాలువలో ప్రమాదవశాత్తూ జారిపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కసుమూరులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన అల్లూరు శ్రీకాంత్ (30)కు కసుమూరుకు చెందిన శిరీషతో మూడేళ్ల క్రితం వివాహమైంది. చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఈయన దసరా సెలవుల నేపథ్యంలో భార్యతో కలిసి కసుమూరుకు ఇటీవల వచ్చారు. వాకింగ్‌కు మంగళవారం ఉదయం వెళ్లిన శ్రీకాంత్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య ఫోన్ చేయగా, స్విచ్ఛాఫ్ రావడంతో కసుమూరు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియలేదు. పాలిచెర్లపాడుకు వెళ్లే మార్గంలోని సాగునీటి కాలువలో మృతదేహం తేలడంతో గ్రామస్తులు బుధవారం ఉదయం వెళ్లి చూశారు. మృతుడ్ని శ్రీకాంత్‌గా గుర్తించారు. వాకింగ్‌కు వెళ్లిన ఆయన కాలువలో పడి మృతి చెందడంతో భార్య బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



చేజర్ల (సోమశిల): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన చేజర్ల మండల పరిధిలోని గాలిపాళెంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మర్రి తిరుపాల్‌రెడ్డి కుమారుడు శ్రీనయ్య (26) మోటార్ల రిపేర్లు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువ వద్ద మోటార్ రిపేరు నిమిత్తం వెళ్లారు. మరమ్మతులు చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. చేజర్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.118	స్కిన్‌లెస్ చికెన్	: రూ.236
లేయర్	: రూ.122		
బ్రాయిలర్ చికెన్	: రూ.214	లేయర్ చికెన్	: రూ.207